# ఆ ముసలాయన

కె.కె. రఘునందన



**వృద్ధాప్యంలో పిల్లలు ఆదరిస్తే ఒక వరం. నిరాదరిస్తే శాపం. వృద్ధాప్యాన్ని కథాంశంగా ఇద్దరు రచయితలు స్పృశించిన భిన్నకోణాల్ని ఈ రెండు కథల్లో చదవండి...**

**రైలు ప్రయాణం బాగుంటుంది. ఎక్కీ ఎక్కడంతోటే కిటికీ దగ్గర చతికిల పడాలనే ఉబలాటం.... ప్రక్కతంతా కనుల ముందు కదిలిపోతుంటే కలిగే అనుభూతుల దొంతరలు... పల్లీలమ్మే వాళ్ళ దగ్గర నుంచి పాలిష్ చేసేవారి దాకా అరిచే అరుపులు... టిక్కెట్ కలెక్టర్ వెంట పడేవాళ్ళు... భలేగుంటుంది.**

అనుకోని ఈ ప్రయాణం మా ఆవిడ మిత్రురాలు పెండ్లికి. మేం సామాన్లు సర్దుకుని కూర్చునేసరికి మా ఎదురుగా ఓ డెబ్బైయేళ్ళ ముసలాయన బైఠాయించాడు.

ఎవడో బిచ్చగాడొచ్చి చేయి చాచాడు. 'అప్పుడే వెధవ సంత మొదలైంది' శ్రీమతి సత్య విసుక్కుంటున్నా జేబులోంచి డబ్బులు తీయబోయాను.

''ఇలా అడిగిన వాడికల్లా ఇస్తూపోతే మన పనింతే'' అన్న సత్య మాటలకు తగ్గాను.

ఎదురుగా ముసలాయన ఓ రూపాయి తీసి వాడి చేతిలో పెట్టాడు. ''మీరు ఎక్కడి దాకా'' అడిగాడాయన విషయం చెప్పాం.

''మీరు?'' అడిగాను.

''మా కోడలు తమ్ముడి పెళ్ళికి.... హైదారాబాద్‌లో...''

''మరి మీ వాళ్ళు...'' అడిగింది సత్య.

''ముందే వెళ్లి పోయారు. నేను ఒక్కడినీ ఇప్పుడు బయలుదేరా... ఎల్లుండి పెళ్ళి. ఒకటికి పదిసార్లు పిలిచారు. అందుకే తప్ప లేదు. లేకపోతే ఈ వయసులో ఈ ప్రయాణాలు నాకెందుకు చెప్పండి'' అని నవ్వారాయన.

''అహా అలా అనికాదు లెండి. పెద్దల ఆశీర్వాదం ఉంటే పదికాలాలపాటు చల్లగా ఉంటారని వారి భావం'' ఆరిందాలా అన్నది శ్రీమతి.

అదే సమయంలో డేక్కుంటూ ఓ కుర్రాడొచ్చాడు. షర్టుగుడ్డతో దిగువ నంతా ఊడుస్తున్నాడు. కాళ్ళెత్తమని చెత్తనంతా బయటకు లాగాడు. మావంక చూసి చేయి చాపాడు.

మొహం తిప్పేసింది సత్య.

ఆ ముసలాయన మాత్రం ఏదో చేతిలో పెట్టాడు.

''ఇలాంటి వారిని నమ్మకూడదు. చెప్పుల దొంగలు మరుపు తెరుపుగా ఉంటే సూట్ కేసులు కూడా కొట్టేస్తారు'' రుసరుస లాడింది సత్య. ''అలా గనకమ్మా! ఎవరో కని పడేస్తే... ఇక్కడిలా అభాగ్యుల్లా.. రైళ్ళని నమ్ముకుని బ్రతుకు వెళ్ళదీస్తున్నారు'' సానుభూతి కనబరుస్తూ మాట్లాడారాయన.

''మీరెందులో పనిచేసారు?'' అడిగాను.

''రైల్వేలో చేసి రిటైరైనాను. ఇద్దరు కూతుళ్ళు ఒక కొడుకు'' అనగానే చేతిలో నున్న సెల్ రింగయింది.

మాటవినబడదని కాబోలు గబగబ ముందుకునడిచారు.

''హల్లో...హల్లో... ఆc ఆc బాగానే ఉంది ప్రయాణం...ట్రైన్ దగ్గరకా ఎందుకమ్మా నేను వచ్చేస్తాగా.. కారా? ఎందుకూ... సరేలే నీ ఇష్టం'' అని తిరిగి

వచ్చి కూర్చున్నాడాయన.

"మా కోడలు సౌమ్య... పేరుకి తగ్గది నన్ను కన్న తండ్రి కంటే మిన్నగా చూసుకుంటోంది. నిజానికి కోడలు తమ్ముడికి ఏం పట్టింది చెప్పండి? నా కోసం స్టేషన్‌కి కారుపంపిస్తాట్ట..'' ఆనందంగా చెప్పారు.

"అదృష్టవంతులు మీరు'' అంది శ్రీమతి.

"మా వాడు సృజన్..కంప్యూటర్ ఇంజనీర్ ముంబయిలో ఉద్యోగం. నెలకి జీతం అర లకారం కంపెనీ వాళ్లే క్వార్టర్స్ ఇచ్చారు. వాడి బావమరిది కారు కొన్నాడని వీడూ గెంతుతున్నాడు కొంటానంటూ... ఎందుకురా అంటే వినడు. రేపు విజయదశమికి కొనమని మా కోడలు ఒకటే పోరుతోంది. మా వాడిజీతం మీద కాదులెండి... మా కోడలు బాగా ఉన్నవాళ్ళ పిల్ల... ఆమె ఏది కావాలంటే అది కొనిపెట్టడానికి మా వియ్యంకుడు రెడీనే'' అని ఆగి ఎవరో ఒకామె చంకలో పిల్లాడిని వేసుకుని వచ్చి దీనంగా చూస్తుంటే జేబులోంచి ఓ రూపాయి కాసు తీసి వేసారాయన.

శ్రీమతి నా వెనుకనుండి గోకింది. నేనూ జేబులోంచి ఓ రూపాయి తీసివేసాను.

"నేనూ దానకర్ణుడిని కాను అసలీ కాలంలో ఎవడండీ దానకర్ణుడు? నేను అవసరార్థం ఉపయోగించే చిట్కా ఏమిటంటే'' అని నవ్వారు.

"బాబాయ్ గారూ ఆ చిట్కా ఏమిటో చెప్పండి'' ఉత్సుకతగా అడిగింది సత్య.

"మరేంలేదు ఓ ఇరవై రూపాయల చిల్లర చేబులో వేసుకోవడం అడిగినవాడి కల్లా లేదు అనకుండా అర్థో, రూపాయో వేయటం. ఖర్చులో ఇదో ఖర్చు.. ఎలా ఉంది?'' నుదురు ఎగరేస్తూ అన్నారు.

నిజమే చేయి చాపిన వాడిని చూసి మొహం పక్కకు తిప్పటమో, పెదవి విరవటమో చేయకుండా చక్కనైన చిట్కా.

ఎదురుగుండా సైడ్ బెర్త్‌లో పాప కిటికీ దగ్గర సీటు కావాలని ఒకటే మారాం చేస్తున్నది. వాళ్ళ అమ్మకాబోలు పిల్ల ముద్దు తీర్చకుండా తనే మొండిగా కిటికీ దగ్గరగా కూర్చున్నది.

ఆ దృశ్యం చూడగానే ఆ ముసలాయన లేచి దగ్గర కెళ్ళి ఆ పాపను ఎత్తుకుని వచ్చి ఒడిలో కూర్చుండ బెట్టుకున్నారు. " ఈ పిల్లను చూస్తుంటే నా మనుమలు గుర్తు కొస్తున్నారు. సుధీర్, వైష్ణవి కొడుకు సంతానం. జాహ్నవి, రవిచంద్ర శ్రీరామ్ కూతుళ్ళ పిల్లలు.. ముద్దులొలికే నపుడే వారిని సాకాలి. ముచ్చట్లు తీర్చాలి. మరి పెద్దలే వారి అభిరుచులు ఖండిస్తే ఏం సబబు'' అని ఆ పాపను ముద్దుల వర్షంలో ముంచెత్తారాయన.

పాపను ముద్దుముద్దుగా అన్నీ అడిగాడు. కిటికీ లోంచి చూపిస్తూ "చూసారా! ప్రేమంటే అదీ. వారి మనవలను ఆపాపలో చూసుకుని ఎలా మురిసిపోతున్నారో మీరూ ఉన్నారు. తాతంటే నే మీకు నామోషీ!'' గునిసింది సత్య.

"చూసారా! అదండీ అదృష్టమంటే మనమూ ఉన్నాం. కనీసం రైల్లో ఫస్టు క్లాసులో నయినా ప్రయాణించామా. విమానం మొహం చూడాలంటే మరో జన్మెత్తాలి'' అదోవిధమైన అసంతృప్తి రగిలిన నీలినీడలు సత్య మొహంలో.

తుని దాటి చాలా సేపయినట్లుంది. అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దేవాలయం దీపాల కాంతులు మిలమిల లాడుతూ కనబడుతున్నాయి.

"మీల్స్ మీల్స్'' అంటూ కేక వేస్తున్నాడు. ఆర్డరిచ్చినవారికి తెచ్చిస్తున్నాడు.

మేం ముందే తెచ్చుకున్నాం. "మీరు'' ముసలాయనను అడిగాను.

"ఏదో తెచ్చుకున్నాలెండి. అయినా ఈ వయసులో నా తిండెంతని?'' అని ఓ చిన్న ప్యాకెట్‌ను సంచిలోంచి తీసారు.

భోగిలో ఒకరిద్దరు తప్ప అంతా భోజనాలకి సిద్ధమైనారు. మా క్యారేజి విప్పాం.

"బాబాయ్‌గారూ! ఈ కాస్త దధ్ధోజనం వేసుకోండి. చద్దికూడా కాంబినేషన్ బాగుంటుంది'' అని బలవంతం చేసి మరీ వడ్డించింది సత్య.

"వద్దు వద్దంటున్నా నీలాగే వడ్డిస్తుందమ్మా నా కూతురు సౌదామిని. అది కూడా బాగానే చదువు కుంది. డబుల్ ఎమ్మే బి.ఇడి కూడా చేసింది. అల్లుడు వసంత్ డాక్టర్. ప్రాక్టీసు బాగుంటుంది అందుకనే భార్యను ఉద్యోగం చేయించలేదు. నేను ఎప్పుడూ బెంగుళూరు వెళ్ళేది ఎలాగో చెప్పండి'' చెప్పి మా వైపు చిత్రంగా చూసారు.

"రైల్లో ఎ.సి. కంపార్టుమెంట్లోనా'' ఊహిస్తున్నట్లుగా అందిసత్య.

"అలా వెళతానన్నా మా అల్లుడు వసంత్ వింటేనా? ఫ్లైట్‌కి టిక్కెట్స్ బుక్ చేసి మరీ రప్పిస్తాడు. అలాగే మళ్ళా పంపిస్తాడు. ఎందుకమ్మా వేస్టు అంటే ఒప్పుకోడు. మీ కెందుకు డబ్బు గొడవ నే చూసుకుంటాగా మీరు హాయిగా ఎంజాయ్ చేయండి అంటాడు. నిజంగా అల్లుడు కాదమ్మా బంగారం. నిజంగా సౌదామిని అదృష్టవంతురాలు. ఆడదాని అదృష్టం అంటే అదే'' అని తినటంలో మునిగాడు.

తరువాత చేతులు కడుక్కోటానికి వెళ్ళాడాయన.

"చూసారా! అదండీ అదృష్టమంటే మనమూ ఉన్నాం. కనీసం రైల్లో ఫస్టు క్లాసులోనయినా ప్రయాణించామా. విమానం మొహం చూడాలంటే మరో జన్మెత్తాలి'' అదో విధమైన అసంతృప్తి రగిలిన నీలినీడలు సత్య మొహంలో.

ఆ ముసలాయన చెవి దగ్గర సెల్ పెట్టుకుని మాట్లాడుతూ రావటం గమనించాం.

"ఆc ఆc అలాగే...బాగానే ఉంది. వొచ్చాక డాక్టర్ దగ్గరకు వెళతానమ్మా'' ఎవరని మేం అడగకపోయినా ఆయనే "మా అమ్మాయి'' అని కూర్చున్నాడు.

"సౌదామినా?'' అడిగింది సత్య.

"కాదు అనీత మా రెండో అమ్మాయి. భువనేశ్వర్‌లో ఉంటుంది. దానికి నా గురించి మరీ జాగ్రత్త లెండి'' అన్నారు సెల్ జేబులో పెట్టుకుంటూ.

ఇందాకా పాప చప్పట్లు చరుస్తూ ఆడుతుంటే దగ్గరకు తీసుకుని ముద్దులాడి చేతిలో చాక్లెట్ పెట్టారు. అది చూసి మరో ముగ్గురు పిల్లలు వచ్చి చేయి చాపారు. వారికీ ఇచ్చారాయన.

అదే సమయంలో అయ్యప్ప భక్తులు హడావుడిగా రైలెక్కి 'స్వామియే శరణం అయ్యప్ప' అనిప్రార్థనలు మొదలెట్టి క్రమంగా ముందు కెళ్ళిపోయారు.

సవ్వడి సద్దుమణిగాక "రెండో అల్లుడు ఏం చేస్తున్నాడండీ'' అడిగాను.

"ఆc అతగాడు ఎక్స్‌పోర్టు అండ్ ఇంపోర్ట్‌లో పెద్ద ఆఫీసర్. ఒక్క క్షణం తీరికుండదు. ఎందరు ఇంటికి వెళ్ళినా ఆదరిస్తాడు. హెల్పింగ్ నేచర్ ఎక్కువ'' గొప్పగా చెప్పారు.

చల్లగాలి ఎక్కువయింది. పడుకోవటానికి సిద్ధమవుతున్నారు. బెర్త్‌లు ఎత్తుతున్నారు.

మిడిల్ బెర్త్ నాది. సత్యది లోవర్ బెర్త్. మా వైపు అప్పర్ బెర్త్ మీద కుర్రాడు చెవుల్లో వాక్‌మన్ పెట్టుకుని కులాసాగా ఏదో తింటుంటే దిగువ నున్న ముసలాయన నెత్తిపై పడింది తలెత్తి చూసారాయన.

"సారీ సారీ'' అంటూ గబగబ దిగిన కుర్రాడు ముసలాయన కోపాన్ని తగ్గించటానికి నానా తంటాలు పడ్డాడు.

"మీలాంటి కుర్రాళ్లను ఉడుకు రక్తం ఎక్కువయ్యా ముందు వెనుకలు చూడరు. మా మనవడు రవిచంద్ర కూడా నీలాగే ఎంతసేపూ చెవుల్లో తాళ్ళుదూర్చేస్కుని ఒకటే గెంతుతాడు. వెళ్ళవయ్యా వెళ్ళు'' అనేసారాయన.

ఆయనతో అలా ఎంతోసేపు మాట్లాడాలని, చెప్పేవాటిని వినాలని అనిపిస్తూంది మాకు.

"ఎంతసేపూ నేను మాట్లాడ్డమే తప్ప మీరు నోరిప్పటం లేదు. ఇంతకీ నీకెందరు పిల్లలమ్మా?'' చెప్పింది సత్య.

" ఇద్దరూ కూతుళ్ళేనండీ?'' చెప్పింది సత్య.

" ఎవరికి ఇచ్చారు?'' తిరిగి అడిగారు.

"మొదటి అమ్మాయిని బెంగుళూరిచ్చాం. రెండో అమ్మాయిని హైదారాబాద్.'' నేను జవాబిచ్చానే కాని లోతుపాతులు తెలుసుకోవాలని ప్రయత్నించనిదే ఈ ముసలాయన ఊరుకోడేమో.

"మరి మీ అల్లుళ్ళు!'' తవ్వటం మొదలెట్టాడు.

ఆరిందాలా పెదవి విప్పబోతున్న సత్యవైపు ఆగమన్నట్లు చూసాను.

"మా పెద్దల్లుడు గోవింద్ కంప్యూటర్ ఇంజనీర్ బెంగుళూర్‌లో పెద్ద జీతగాడే. రెండోవాడు హైదారాబాద్‌లో పెద్ద పబ్లిక్ స్కూల్ నడుపుకుంటూ బాగానే గడిస్తున్నాడు'' నా మొహంలో ఏ మరక పాకకుండా జాగ్రత్త పడ్డాను.

"అల్లుళ్ళు అన్నట్లు మీ అల్లుడి అడ్రస్ఇస్తే మా అల్లుడికి పంపిస్తాను. కలుస్తూంటారు. మా అల్లుడు అడ్రస్ ఎక్కడో రాసాను గాని ఫోన్‌నెంబర్ ఇస్తాను రాసుకోండి''

అని నెంబరు చెప్పారు.

నేను ఎక్కించుకున్నాను.

''మీ అల్లుడి ఫోన్ నెంబర్ లేదా అడ్రస్'' అడిగాడు.

''అయ్యో! ఇంటి దగ్గర డైరీలో ఉండిపోయిందండీ'' అన్నాను నిట్టూర్చి.

''మీరెప్పుడూ అడ్రసు పుస్తకం వెంటతెచ్చుకోరు'' విసుక్కున్నట్లు అంది సత్య.

కొద్దిసేపు మౌనం తరువాత ''అన్నట్లు మీరు ఎప్పుడయినా 'గరుడా' బస్సు ఎక్కారా?'' అదాటుగా ఎందుకలా అడిగారో తెలీదు.

'' ఉహు!'' పెదవి విరిచాను.

''నేనెక్కానమ్మా మహా మజాగా ఉంటుందిలే ఎక్కడా ఒక్క కుదుపుండదు. విమానంలో ప్రయాణించనట్లు ఉంటుంది. సాయంత్రం 6గం.కి విశాఖపట్టణంలో ఎక్కితే ఉదయానికల్లా హైదరాబాద్‌లో ఉంటాం. అసలు వెళ్తున్న ఫీలింగ్ ఉండదు. చాక్లెట్స్, డ్రింకు ఇస్తారు. ఎ.సి. వల్ల చలికి దుప్పటి కూడా సరఫరా చేస్తారు. గరుడాలో ఎక్కడానికి కారణం మా అమ్మాయి'' అని ఆగారు.

''ఎవరు అనితా?'' అడిగింది సత్య.

''కాదు సౌదామిని. దాని బలవంతం వల్లనే గరుడా ఎక్కానోసారి. ట్రైన్‌కి రిజర్వేషన్ దొరక్కపోతే ఆ ఏర్పాటు చేసారు'' ఆయనలో ఆనందం వెల్లివిరుస్తోంది.

''గుడ్‌నైట్'' అని చెప్పి మిడిల్ బెర్త్ ఎక్కారు.

అప్పటికే చాలా మంది నిద్రలోకి జారుకున్నారు.

నా ఆలోచనలన్నీ పరిపరి విధాలుగా సాగాయి.

ఈ ముసలాయన జీవితం వడ్డించిన విస్తరి. ముసలితనం శాపం అంటారు కాని ఈయనకు వరంలా కనిపిస్తుంది. దేనికీ ఎక్కడా తడుముకోకుండా అమరటం పూర్వజన్మ సుకృతం.

నా ప్రస్తుత జీవితం ఒడిదొడుకులు... భంగపడ్డ అవకాశాలు... ఎదుర్కొన్న అవమానాలు... పల్టీలు కొట్టిన ఆశయాలు. ఎవరికి చెప్పగలం ఏమని చెప్పగలం??

వైదొలగని అసంతృప్తి నీడలా ప్రాకుతూ నిద్రలోకి ఎప్పుడు జారానో తెలీదు. కళ్ళు తెరిచేసరికి బాగా తెల్లవారిపోయింది. శ్రీమతి సత్య, ముసలాయన అప్పటికే కబుర్లలో పడ్డారు.

''మా వాడి ఇల్లుంటుందీ అది ఇల్లు కాదమ్మా ఇంద్రభవనమే'' ఇరవై లక్షలయింది'' అంటూ ఒకటే పొగడ్తలు.

''నాది అదృష్ట జాతకమమ్మా. ఇంతటి వైభవం మరెవరికీ ఉండదు'' కాలకృత్యాలు తీర్చుకుని నేను వస్తున్నపుడు అంటున్న మాటలు.

కాఫీలు వచ్చాయి త్రాగాం. మరో అర్ధగంట మాట్లాడేసరికి సికింద్రాబాద్ వచ్చేసింది.

''హమ్మయ్య! వచ్చేసింది వెళతానమ్మా'' అని చిన్న బ్యాగు తగిలించుకున్నారాయన.

ఎక్కినంత గాబరా దిగినప్పుడూ ప్రయాణీకుల్లో కనిపించింది.

''ముసలాడిలా అనిపిస్తున్నాడా ఎక్కడయినా? ఎంత చలాకీగా నడుస్తున్నాడో చూడు'' అన్నాను.

ఆయన ప్లాట్‌ఫారం మీదకెళ్ళాక.

''మనసుకి దిగులు లేకపోతేనే కదండీ ఆనందమూ, హుషారూనూ. మనల్ని చూడండి వంద లంఖణాలు చేసినవారిలా కనిపిస్తున్నాం. మీకంటే ఆయన వయసు చాలా ఎక్కువ కానీ? అంతేనండీ మన రాత యింతే అనుకోవాలి'' గుండె బరువుతో అంది సత్య.

''ఈపాటికి ఆ ముసలాయనకి కారొచ్చి ఉంటుంది. అయినా దేన్ని అనుభవించటానికయినా పెట్టి పుట్టాలి. ఎంత సంపాదించినా విలువ లేదు. కనీసం ఈ ఊర్లో ఉన్న అల్లుడితో మనమిలా వస్తున్నట్లు ఫోన్ చేస్తే కనీసం మర్యాదకోసమైనా గుమ్మంలోకి రమ్మన్నాడా?'' కన్నీరుపెట్టుకుంది సత్య.

''నిజమే సత్యా! మనమ్మాయి మాలినికి మంచి సంబంధం అనుకుని, ఇలాటి వాడికి కట్టబెట్టాను. మనవడిని చూడాలని నా కెంత ఆరాటంగా ఉందో తెలుసా?'' అని కళ్ళు తుడుచుకున్నాను.


''చూడాలని నాకు మాత్రం లేదా? కాని, మనం ఏ మొహం పెట్టుకుని వెళ్ళగలం. నిన్నగాక మొన్న దీపావళికి దిగబడి నానారాద్ధాంతం చేయలేదూ మోటారు బైక్ కొనమని అంత డబ్బు ఇప్పుడేదీ?'' దిగులింకా వీడలేదు.

ఫ్లై ఓవర్ దాటాక స్టేషన్ బయటకు వచ్చేసాం. దిల్ షుక్‌నగర్ బస్సు కోసం స్టేషన్ దగ్గర కాంప్లెక్స్‌కు నడిచాం.

''అదిగో అదే గరుడా బస్సు ఇదే ఆ ముసలాయన ఎక్కానన్నాడు అబ్బ ఎంత బాగుందో...'' అని బస్సు కనుమరుగయ్యే దాకా చూస్తూ మురిసిపోతోంది సత్య.

## మేకప్ లేకుండానా!

దీపామెహతా, షబానా అజ్మీ లాంటి వాళ్లు మేకప్ లేకుండా చేస్తే బావుంటుందేమో అనుకునేవాళ్ళకిప్పుడు లారాదత్తా సూటి ప్రశ్నలు వేస్తోంది. అసలు కొత్త తరం నటీమణులు కూడా మేకప్ లేకుండా నటించే సత్తా వున్నవారేనని తనను తాను పొగుడుకుంటోంది. ఇంతకీ విషయమేంటంటే, ఓ ఆకతాయి పిల్ల వేషంలో 'జిందా' అనే సినిమాలో నటిస్తోంది లారా. కానీ మేకప్ లేకుండా. అదేంటని అడిగితే, దర్శకుడి అనుమతి మేరకే చేసినా, నాక్కూడా ఒక్కసినిమాలో అయినా సహజసిద్ధంగా కనిపించాలని కోరికుండేదని సెలవిచ్చింది. ఇలా కనిపిస్తే లారా ఎలా వుంటుందో చూడాలని ఆశపడేవాళ్ళకి త్వరలోనే ఆ కోరిక తీరనుంది.






''ఇంతకీ ఆ ముసలాయన పేరేమిటి సత్యా!'' అడిగాను.

''అరెరె ఎంత పనయిందండీ అంత సేపు మాట్లాడినా సరే... పేరే కనుక్కోలేదు'' విచారంగా అన్నది సత్య.

''పద నూట ఏడు వచ్చింది ఎక్కేద్దాం'' అన్నాను.

''మీరేమిటి ఆ ముసలాయన దగ్గర మీ అల్లుళ్ళిద్దరి గురించి బిల్డప్ ఇచ్చారు'' సీటులో సర్దుకున్నాక అడిగింది.

''ఆయన పూల పడవ మీద ప్రయాణిస్తుంటే నేను ముళ్ళబాటలో నడుస్తున్నట్లు ఎలా చెప్పేది అందుకే తప్పయినా ఒప్పయినట్లుగా చెప్పుకున్నాను'' అన్నాను.

జీవితం ఇంత ఇరుకు అవుతుందనుకోలేదు... రెండో అమ్మాయి పురుడు మనం పోయాలిట రెండో పురుడు వాళ్ళపూచీనే పైగా ఆసుపత్రి సదుపాయం ఉంది'' అంది సత్య.

అది మనం వేరే చెప్పాలా? ఆ విజ్ఞత వారికి ఉండాలి. ఆడపిల్లని కన్నందుకు శిక్ష మనకేగా'' తెగ నిట్టూర్చాను.

ఇలా ఆలోచనల్లో ఉండగానే బస్సు స్టాప్ వచ్చింది. దిగి పెళ్ళివారిల్లు కనుక్కొన్నాం. సత్య మిత్రురాలు ఎదురొచ్చి పలకరించి లోనికి తీసుకు వెళ్ళింది.

పెళ్లి ముహూర్తం అవగానే వధూవరులను ఆశీర్వదించి వెంటనే బయలుదేరాం ఉండమంటున్నా సరే.

''అమ్మాయి దగ్గరకెళితే బాగుంటుందేమో... ఓసారి ఆలోచించండి'' నా వైపు చూస్తూ అడిగింది సత్య.

''లేదు మన మొహాలు చూస్తే అల్లుడు శివ తాండవమాడతాడేమోనని భయం... ఎందుకు లెద్దూ...రైలెక్కేద్దాం'' అని తొందరించాను.

ఇంటికి చేరినా ఏదో పూడ్చలేని లోటు. రిటైర్ కాక ముందు ఎటువంటి ఇబ్బడి ముబ్బడి పరిస్థితులు ఎదురైనాయో, రిటైర్ అయినాక కూడా వ్యతిరేక పవనాలు బలంగా వీచి మనస్సును కల్లోలిత ప్రాంతంగా మారుస్తున్నాయి.

మధ్య తరగతి మనుషులు హోదాల కోసం చేసే వెర్రిప్రయత్నాలకు సంకెళ్ళు వేస్తూ సందడి చేసుకుంటున్న వాస్తవాలు!!

నెలరోజుల తరువాత రెండో అమ్మాయి మాధవి నుండి ఫోన్. పురుడు విషయంలో శ్రీవారు చిందులేస్తున్నారని అత్త గారితో పడలేక పోతున్నానని పల్లెటూరయినా సరే అక్కడే ప్రశాంతంగా ఉంటుందని, ముహూర్తం పెట్టి తీసుకెళ్ళమని.

మా పల్లెలో సదుపాయాలు శూన్యమైనా దేవుడి పై భారం వేసి మాధవిని తీసుకురావటానికి విజయనగరం బయలుదేరాం. మరల రైలు ప్రయాణం.

సరిగ్గా నెలక్రితం రైలులో మాతోపాటు ప్రయాణించిన ముసలాయనతో కాలక్షేపం గుర్తుకొచ్చింది. ఆయన చెప్పిన అనుభవాలన్నీ ఒక్కసారి హృదయాన్ని తట్టిలేపాయి.

మేం మాధవి ఇల్లు చేరేసరికి రాత్రి ఎనిమిదయింది.

అల్లుడు మొహం మాడ బెట్టుకుని ఉన్నాడు. వియ్యపురాలు పలకరింపు కొత్తగా ఉంది వియ్యంకుడు మరీనూ.

ఉన్నంత సేపూ మాధవే ఆత్రపడింది తప్ప తతిమ్మావాళ్ళు పట్టించుకోలేదు.

''మనవడితో అలా వెళదామా'' సత్యను అడిగాను.

సరేనంది అపార్ట్‌మెంట్ దిగువకు వెళ్ళాం. క్రింద ఫ్లాట్‌లో ఏవో అరుపులు కేకలూను.

''మహానుభావా నీ పరిస్థితి చూస్తుంటే మాకు మంటెత్తిపోతోంది. ఇంత వయసొచ్చినా బుద్ధి రాలేదు. కొడుకుతో పడదు కోడలితో పడదు కడుపారా మెక్కుతున్నావు కదా! సిగ్గులేదా. అలా బ్రతకటానికి కూతుళ్ళ దగ్గరకుపోతే అల్లుళ్ళు తంతారని భయం'' అని ఓ ఆడగొంతు సాధిస్తూంది.

''మర్యాదుంచి మాట్లాడు'' మగ గొంతు.

''నీకు మర్యాదిచ్చేదేంటి? శని గ్రహంలా దాపురించావు'' ధాష్టీకం చేస్తూంది.

మెల్లగా రోడ్డుదాకా వచ్చి ఫ్లాట్ వైపు చూసాం. తలుపులు బడాలుమన్నాయి. నెట్టినట్లుగా బయట పడ్డా డొకాయన.

చేతుల్లో మొహం దాచుకుంటూ రాసాగాడు. మనవడు చాక్లెట్‌కి అల్లరి పెడితే తీసుకు వెళ్ళాను. నేను వెళ్ళిన క్షణమే సత్య గభాలున నన్నుతట్టి ''ఏమండీ...అటు చూడండి... ఆయన ఆయనే నండీ!'' అన్నది.

''ఎవరు సత్యా!'' అనుమానంగా అడిగాను.

''అదే ఆ ముసలాయనండీ... ఆ రోజు రైల్లో ఆయన...''

''ఔనౌను... ఆయనే సత్యా! అదిగో ఆ కొట్టు దగ్గర...'' అటువైపు వెళ్ళాం.

''బాబాయ్‌గారూ'' పిలిచింది సత్య.

మమ్మల్ని చూస్తూనే కలవరపడుతూ ''మీరు... మీరు'' అన్నాడు.

''ఔను మీరారోజు రైల్లో మీ కోడలు తమ్ముడి పెళ్ళికి వెళుతూ విమాన ప్రయాణం. గరుడా బస్సు. ఇంకా చాలా కబుర్లు చెప్పారు కదా..'' మరోసారి గుర్తుకు తెచ్చింది.

''ఔనమ్మా! మీకా రోజు రకరకాలు తీయని కబుర్లు చెప్పింది ఈ ముసలాడేనమ్మా??'' అని తలదించుకున్నాడు.

''మరి మీరు ఆ రోజు ఎందుకలా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''నేనా రోజు చెప్పింది అంతా ఉత్తిదే. సెల్‌ఫోన్ కూడా సీట్లో ఎవరో విడిచిపెట్టింది నా దగ్గరుంచాను. కాస్సేపయినా సరే మీలాటి వారితో ఆనందంగా గడపాలని అప్పుడప్పుడు అలా ప్రవర్తిస్తుంటాను. గుమ్మందిగితే కారు మీద తిప్పే కొడుకులు. విమానాల మీద పంపే అల్లుళ్ళు కొసరి కొసరి వడ్డించే కోడళ్ళు ఇంద్ర భవనాల్లాటి ఇళ్ళు ఇదీ నేనూహించుకున్న అందమైన జీవితం. ఆ బాటలో పయనం సాగాలని నాకనిపించేది. దాని గురించి రంగురంగుల కలలు కనేవాడిని. కాని ఎందుకో అపశృతి పలికించాడు దేవుడు'' కళ్ళల్లోంచి బొట్లు రాలకుండానే తువ్వాలుతో అద్దేస్తున్నాడా ముసలాయన.

''నా జీవితం గురించి తూలుచుకున్నపుడల్లా మనసు ముక్కలౌతూనే ఉంటుంది. అందుకే నేను అప్పుడప్పుడు ఇలా మీలాటి వారితో కల్పించి చెప్పి ఆనందం పొందుతుంటాను'' తిరిగి అన్నాడాయన.

మా మనసులు భేదపడ్డాయి.

''మీ మనవడా? ఏదీ ఇలా ఇయ్యి'' అని ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు.

అంతలోనే ఏదో కేకలు

''అదిగో బ్రహ్మ రాక్షసి... అదే మా కోడలు పిలుస్తున్నట్లుంది. వెళ్ళక పోతే ముద్ద ఉండదు ఈ రాత్రికి'' అని వడివడిగా కదిలాడు ఆ ముసలాయన.

''అయ్యో! ఆ ముసలాయన పేరు అడగలేదు'' అన్నాను విచారిస్తూ.

''మళ్లా కనబడ్డప్పుడు మరచిపోకుండా అడుగుదాం'' అన్నాది సత్య.

మర్నాడు మేం తిరిగి వెళ్ళేలోగా ఆ ముసలాయన మా కళ్ళబడలేదు.

★